పవన్.. నోరు అదుపులో పెట్టుకో !

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలి... నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందిస్తున్న తమపై కారుకూతలు కూస్తే సహించేది లేదంటూ వలంటీర్లు హెచ్చరించారు. పవన్ వ్యాఖ్యలకు నిరసనగా హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో నిరసన తెలిపారు.

- నిస్వార్థంగా పనిచేస్తున్న తమపై కారుకూతలు కూస్తావా?
- పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలపై అన్నిచోట్లా వలంటీర్ల నిరసన
- పోలీసుస్టేషన్లలోనూ ఫిర్యాదు



హిందూపురం: పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వలంటీర్లు, చిత్రంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం టౌన్: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వలంటీర్లను ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలపై వలంటీర్లు భగ్గుమన్నారు. నీలా మేము సంస్కార హీనులం కాదంటూ హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక ఆధ్వర్యంలో వలంటీర్లు పట్టణంలో నిరసన తెలిపారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మతో అంబేడ్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ చేపట్టారు. తర్వాత దిష్టిబొమ్మను చెప్పులతో కొడుతూ నిరసన తెలిపి పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అక్కడి నుంచి ర్యాలీగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సీఐ ఈరన్నకు పవన్‌కళ్యాణ్‌పై ఫిర్యాదు చేశారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా పిచ్చివాడిలా మాట్లాడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, నాయకులు కొల్లకుంట ఆనంద్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, వేర్‌హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం మండల కేంద్రంలో వలంటీర్లు నిరసన తెలిపారు. పవన్‌కళ్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని పావగడ – పెనుకొండ ప్రధాన రహదారిపై పీర్లచావిడి వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సచివాలయాల సమన్వకర్త ఆర్‌ఏ రవిశేఖర్‌రెడ్డి, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

గోరంట్ల: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం పట్టణంలో మండల వలంటీర్ల సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేశారు. ఇందులో భాగంగానే పట్టణంలో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించారు.బస్టాండ్ సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించి పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పవన్‌కళ్యాణ్‌పై చర్యలు తీసుకోవాలంటూ సీఐ సుబ్బరాయుడుకు వినతిపత్రం అందజేశారు.

పరిగి: వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం ఎర్రగుంటలో వైఎస్సార్‌సీపీ నాయకులు, లబ్ధిదారులు నిరసన తెలిపారు. పవన్‌కళ్యాణ్ ఫొటోలకు నిప్పంటించి పవన్ డౌన్.. డౌన్ అంటూ నినదించారు. ఎంపీపీ సవిత, సచివాలయ మండల కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, ఎర్రగుంట, ఊటుకూరు సర్పంచ్ బాలకృష్ణ, దిలీప్‌కుమార్ యాదవ్, ఎంపీటీసీ నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలో వలంటీర్లు నిరసన తెలిపారు. ఇందులో భాగంగానే పోలీసుస్టేషన్‌కు చేరుకొని పవన్‌పై చర్యలు తీసుకోవాలని సీఐ వేణుగోపాల్‌కు ఫిర్యాదు చేశారు. వలంటీర్లకు ఎంపీపీ పురుషోత్తమరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు మద్దతు పలికారు.

మడకశిరరూరల్: వలంటీర్లపై పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం ఆర్ అనంతపురం, ఆమిదాలగొంది, భక్తరహళ్లి, బుళ్లసముద్రం, హరేసముద్రం గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు నిరసన తెలిపారు. పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేసి పవన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్, కన్వీనర్లు సత్యనారాయణ, వెంకటేష్, శివగంగప్ప, తిమ్మప్ప, మండల ఎస్సీ సెల్ నాయకులు జమ్మానిపల్లి మూర్తి, రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: పవన్ కళ్యాణ్ ఖబడ్దార్.. నోట్టి కొచ్చినట్లు మాట్లాడితే నాలుక చీలేస్తామంటూ వలంటీర్లు జనసేన అధినేతను తీవ్రంగా హెచ్చరించారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా పట్టణంలోని దర్గా సర్కిల్లో మంగళవారం వలంటీర్లు, మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన తెలిపారు. నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, నందిని, లోకేష్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: వలంటీర్లకు జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ బేషరుతుగా క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. పవన్ వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలో వలంటీర్లు నిరసన తెలిపారు. అనంతరం చర్యలు తీసుకోవాలని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి , వైస్ ఎంపీపీ అంజన్‌రెడ్డి, సర్పంచ్ అశ్వర్థనారాయణ తదితరులు పాల్గొన్నారు.


చిలమత్తూరు: నిరసన ర్యాలీ చేపడుతున్న వలంటీర్లు


పెనుకొండ: ఆందోళన చేస్తున్న వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు

వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి

- ఎమ్మెల్యే తిప్పేస్వామి



మడకశిర: జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ వలంటీర్లకు వెంటనే క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం సాక్షితో మాట్లాడుతూ రాష్ట్రంలో నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లను పవన్‌కల్యాణ్ కించపరచి మాట్లాడం చాలా అన్యాయన్నారు. కరోనా మహమ్మారి వచ్చినప్పుడు ప్రాణాలను సైతం లెక్కచేయక ధైర్యంతో ప్రజలకు సేవలందించారని తెలిపారు. సంక్షేమ పథకాలను అందించడంలో వలంటీర్లు కీలకంగా మారారన్నారు. వలంటీర్లకు పవన్‌కల్యాణ్ క్షమాపణ చెప్పాలని , లేకపోతే పవన్‌కల్యాణ్‌కు వలంటీర్లు తగిన బుద్ధి చెబుతారన్నారు.


హిందూపురం: పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను చెప్పులతో కొడుతున్న మహిళా వలంటీర్లు


మడకశిర: ఆర్ అనంతపురంలో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు


గోరంట్ల: పవన్‌పై చర్యలు తీసుకోవాలని సీఐ సుబ్బరాయుడుకు ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు


పరిగి: ఎర్రగుంటలో పవన్‌కళ్యాణ్ ఫొటోలను తగులబెడుతున్న దృశ్యం

గడప గడపలో ఆనందం


కొండాపురంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

గోరంట్ల: ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు వచ్చి చేరుతున్నాయంటూ లబ్ధిదారులు ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఎదుట హర్షం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని కొండాపురంలో సర్పంచ్ బోయ అనిత, ఎంపీటీసీ సభ్యురాలు సునంద నేతృత్వంలో ఎమ్మెల్యే శంకర నారాయణ ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించడంతో పాటు స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజాదరణ కోల్పోయిన ప్రతిపక్షాలు 2024 ఎన్నికల్లో ఓటమి పాలవుతామని భావించి, పచ్చమీడియ సహాయంతో ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని ఎమ్మెల్యే శంకరనారాయణ విమర్శించారు. వాటిని ప్రజలే తిప్పికొట్టాలన్నారు. అనంతరం కొండాపురం గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తర్వాత రెడ్డిచెరువుకట్ట సమీపంలో రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యులు పాలేజయరాంనాయక్, పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, గోరంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షులు నూర్‌మహమ్మద్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు బాషా తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెనుకొండ రూరల్: క్రిమి సంహారక మందు సేవించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామ్మోహన్ (44) సోమవారం రాత్రి మృతి చెందారు. మండలంలోని మునిమడుగుకు చెందిన రామ్మోహన్ మతిస్థిమితం సరిగా లేకపోవడంతో మూడు రోజుల క్రితం క్రిమిసంహారక మందు సేవించాడు. మృతునికి భార్య సుజాతమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మంగళవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం


మడకశిర రూరల్: జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు


హిందూపురం: జ్యోతుల ఉత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి

హిందూపురం అర్బన్: మండల పరిధిలోని తూమకుంట, దేవరపల్లి గ్రామాల్లో వెలసిన సప్పలమ్మ అమ్మవారికి మంగళవారం ఆయా గ్రామాల ప్రజలు జ్యోతుల ఉత్సవాలు నిర్వహించారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పెద్ద ఎత్తున జ్యోతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అగళి: మండల పరిధిలోని ఆలుడి గ్రామంలో వెలసిన కరిమ్మదేవికి మంగళవారం ఘనంగా జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు బియ్యం పిండితో చేసిన జ్యోతులను మోసుకుని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి సమర్పించారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం గ్రామంలో వెలసిన ఊరిమారెమ్మ, సఫలమ్మ, గౌడ చంద్రమారెమ్మకు మంగళవారం మహిళలు ఘనంగా జ్యోతుల ఉత్సవాలను నిర్వహించారు.

జగనన్న సురక్షతో అర్హులందరికీ న్యాయం


మడకశిర: సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ న్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడానికే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. పట్టణంలోని పెనుకొండ రోడ్డు, కొత్త ఎస్సీ కాలనీ వార్డు సచివాలయాలకు సంబంధించిన జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం సరస్వతీ విద్యామందిరం ఆవరణంలో జరిగింది. పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ చివరి నిమిషంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి అధికారులకు సూచించారు.

అగళి/లేపాక్షి/అమరాపురం/రొద్దం/పరిగి/రొళ్ల/చిలమత్తూరు/పెనుకొండ రూరల్: 'జగనన్న సురక్ష ' కార్యక్రమం విజయవంతంగా సాగుతోంది. సచివాలయ సిబ్బంది, వలంటీ అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అమలయ్యేలా చర్యలు చేపట్టడంతో పాటు 11 రకాల సేవలను లబ్ధిదారులకు అందిస్తున్నారు. మంగళవారం అగళి, లేపాక్షి, అమరాపురం, రొద్దం, పరిగి, రొళ్ల, చిలమత్తూరు, పెనుకొండ మండలాల్లో అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. అమరాపురం సచివాలయం-1లో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సబ్‌కలెక్టర్ కార్తీక్ తనిఖీ చేశారు.

వక్ఫ్, ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం

- టీడీపీ మాజీ సర్పంచ్ భూ దందా
- లోకాయుక్త ఆదేశాలతో ఆన్‌లైన్‌లో తొలగింపు

సోమందేపల్లి: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా ప్రభుత్వ, వక్ఫ్ భూములు కబ్జాకు గురయ్యాయి. మండలంలోని నడింపల్లిలో 297 సర్వే నంబరుకు సంబంధించిన 11.12 ఎకరాల వక్ఫ్ భూమిను టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ రామాంజినేయులు, అతని బంధువుల పేరిట అక్రమంగా కాజేసిన విషయం బహిర్గతమైంది. అలాగే 398-2లో 0.55, 398-4లో 0.49, 398-5లో 1.14, 401-4లో 4..25, 402-3లో 6.00 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆ పార్టీ కార్యకర్తలు కొంత మంది ఆన్‌లైన్ చేసుకున్నారు. నిబంధనలు పాటించకుండా భూములకు 1బి, పాసు పుస్తకాలు చేసుకోవడంపై ఆర్టీ కార్యకర్త బాబు ప్రసాద్ గత ఏడాది లోకాయుక్త కోర్టులో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు విచారణ జరిపి భూముల గోల్‌మాల్ జరిగినట్లు నివేదిక పంపారు. పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తిక్ ఆదేశాలతో తహసీల్దార్ సురేష్‌కుమార్ ఆ సర్వే నంబరులోని 1బీ, పాసు పుస్తకాలు రద్దు చేశారు. ప్రస్తుతం ఈ భూముల వ్యవహారం మండలంలో చర్చనీయాంశమైంది.

క్లుప్తంగా

తిమ్మారెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి


తిమ్మారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: మాజీ ఎమ్మెల్యే దివంగత వైవీ తిమ్మారెడ్డిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి కోరారు. మంగళవారం తిమ్మారెడ్డి వర్ధంతి పట్టణంలోని సరస్వతీ విద్యామందిరం ఉన్నత పాఠశాలలో జరిగింది. పాఠశాల కమిటీ అధ్యక్షుడు బద్రీనారాయణ, కార్యదర్శి హనుమంతరెడ్డి, సంభాగ అధ్యక్షులు గోపాలకృష్ణ, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

రొద్దం: మండల పరిధిలోని నారనాగేపల్లిలో ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ తెలిపారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

అమరాపురం: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం 1 పరిధిలో ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


బోల్తా పడిన బొలెరో వాహనం

మడకశిర: పట్టణంలోని హిందూపురం రోడ్డులోని ఐటీఐ కళాశాల వద్ద మంగళవారం త్రుటిలో ప్రమాదం తప్పింది. హిందూపురం నుంచి వస్తున్న ఓ ప్రైవేట్ బస్సును మడకశిర వైపు నుంచి వెళ్తున్న లగేజ్ బొలెరో వాహనం ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా ఆరాధనోత్సవం

రొద్దం: మండల పరిధిలోని దండేపల్లి గ్రామంలో అవధూత సుబ్బరాయప్పస్వామి ఆరాధనోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అవధూత సమాధి వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలువురు స్వామీజీలకు మురళీ కుటంబ సభ్యులు పాదపూజ చేశారు.

పనులు వేగవంతం చేయండి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం టౌన్: స్థానిక ధనలక్ష్మీ రోడ్డులో నెలకొన్న సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషిచేస్తామని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక అన్నారు. మంగళవారం డీఎల్ రోడ్డులో అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. డీఎల్ రోడ్డు విస్తరణలో భాగంగా ఆక్రమణలు తొలగించి నూతన రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు సూచించారు.

ఈయూ ఆవిర్భావ దినోత్సవం


హిందూపురంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

మడకశిర: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం ఈయూ (ఎంప్లాయీస్ యూనియన్) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరించి ఈయూ ఆర్టీసీ కార్మికులు కేక్ కట్ చేశారు. ఆర్టీసీ కార్మికులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈయూ గౌరవాధ్యక్షుడు రవిశేఖర్‌రెడ్డి, నాయకులు రంగనాథ్, రఫీక్, సిద్దగంగప్ప తదితరులు పాల్గొన్నారు.

హిందూపురంఅర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) ఆవిర్భావ దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణస్వామి ఈయూ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఆటో బోల్తా

మడకశిర: పట్టణ సమీపంలోని శివాలయం వద్ద మంగళవారం ఆటో బోల్తా పడిన ఘటనలో పలువురు గాయాలపాలయ్యారు. మండలంలోని ఆమిదాలగొంది నుంచి ప్రయాణికులతో మడకశిరకు వస్తున్న ఆటో శివాలయం వద్దకు రాగానే అదుపు తప్పింది. చందకచర్ల దినేష్, ఆమిదాలగొంది లక్ష్మమ్మ, నరసింహమూర్తి తదితరులు తీవ్రంగా గాయపడగా వారిని ఆస్పత్రికి తరలించారు.

వలంటీర్లకు సత్కారం


వలంటీర్లను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం టౌన్: నిస్వార్థంగా ప్రజా సేవ చేస్తున్న వలంటీర్లను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ సన్మానించారు. వలంటీర్లపై పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం పురపాలక సంఘంలో వలంటీర్లకు సంఘీభావం తెలిపారు. వలంటీర్ వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలకు పవన్‌కల్యాణ్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

శభాష్ నందిని


చెత్త సేకరణ వాహనాన్ని నడుపుతున్న నందిని

పావగడ: మగాళ్లకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఎంతోమంది డ్రైవింగ్‌లోనూ సత్తాచాటుతున్నారు. గుమ్మఘట్టకు చెందిన నందిని అనే మహిళ కూడా ఆ కోవలోకే వస్తారు. దొమ్మతమరి గ్రామ పంచాయతీలో చెత్తను సేకరించే గార్బేజ్ వాహనానికి తొలి మహిళా డ్రైవర్‌గా నందిని తాలూకా స్థాయిలో నిలిచింది. కుటుంబ సభ్యులు కాదన్నా స్వయం కృషితో ఎదగాలనే పట్టుదలతో డ్రైవర్‌గా చేరానని నందిని తెలిపారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యుడు హరికుమార్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి కుటుంబ నియంత్రణ ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మనోహర్ రెడ్డి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

'పురం' ఆస్పత్రిలో అరుదైన చికిత్స


హనుమక్కను డిశ్చార్జ్ చేస్తున్న వైద్యులు

హిందూపురం టౌన్: పట్టణంలో జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఓ అనాథ వృద్ధురాలికి వైద్యులు అరుదైన చికిత్స చేసి ప్రాణం పోశారు. పట్టణంలోని ఓ అనాథ శరణాలయంలో నివాసముంటున్న హనుమక్క (90) జూన్ 15న ఎడమ చేయి పెరిఫెరల్ వ్యాస్కులర్ (రక్తనాళాలలో రక్తం సరఫరా నిలిపోవడం) వ్యాధితో బాధపడుతూ ప్రభుత్వాస్పత్రికి వచ్చారు. వివిధ రకాల పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్స అవసరమని నిర్ణయించారు. వయసు ఎక్కువ ఉన్నప్పటికీ సూపరింటెండెంట్ రోహిల్‌కుమార్ సూచనలతో వైద్యులు జూన్ 17న ఎడమ చేయిని తొలగించి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ఆమె పూర్తిగా కోలుకోగా మంగళవారం డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

యువకుడికి గాయాలు

రొళ్ల: పట్టణ సమీపంలోని మధూడికి వెళ్లే జాతీయ రహదారి మలుపు వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కీర్తి అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఏఎస్‌ఐ బాలాజీ వివరాల మేరకు.. అనంతపురం పట్టణానికి చెందిన కొందరు కర్ణాటక రాష్ట్రం చిక్కమంగళూరు జిల్లా దాదా పహాడ్‌కు కారులో వెళ్లి తిరిగి వెళ్తున్నారు. అయితే మధూడి వద్ద సోమఘట్టకు చెందిన కీర్తి ద్విచక్ర వాహనాన్ని కారు వేగంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన కీర్తిని చికిత్స నిమిత్తం మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.